క్లుప్తంగా

పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్‌దే విజయం

బెజ్జంకి(సిద్దిపేట): కాంగ్రెస్ పార్టీ విజయానికి కార్యకర్తల కృషే కారణమని మానకొండూర్ ఎమ్మెల్యే సత్యనారాయణ అన్నారు. పార్టీ మండల కార్యకర్తల సమావేశం బుధవారం బెజ్జంకిలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పథకాల్లో పేదలకు లబ్ధిచేకూరేలా చూడాలన్నారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థినే గెలిపించాలని పిలుపునిచ్చారు.

సంతల వేలం

దుబ్బాక: దుబ్బాక మున్సిపల్ పరిధిలో నిర్వహించే పశువులు, కూరగాయల సంత, తైబజారు నిర్వహణకు బుధవారం బహిరంగ వేలం నిర్వహించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ గన్నె వనిత, కమిషనర్ రమేష్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన వేలంలో మొత్తం ఎనిమిది మంది పోటీపడ్డారు. రూ.19.6 లక్షలకు గజ్వేల్‌కు చెందిన జంగం గణేష్ గౌడ్ పశువుల సంత, రూ.11.10 లక్షలకు కూరగాయల సంతను దుబ్బాకకు చెందిన ఆస రాజు దక్కించుకున్నారు.

లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి

గజ్వేల్‌రూరల్: రాజీపడదగిన కేసుల పరిష్కారానికి లోక్ అదాలత్ దోహదపడుతుందని అదనపు ప్రిన్సిపల్ సివిల్ జడ్జి, మండల సేవాధికార సంస్థ చైర్మన్ ప్రియాంక అన్నారు. బుధవారం గజ్వేల్ పట్టణంలోని కోర్టు ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. సత్వర, సమన్యాయం కోసం లోక్ అదాలత్ చక్కని వేదికన్నారు. మార్చి 16న గజ్వేల్‌లో జరిగే లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఎక్కువ మందికి న్యాయం జరిగేలా న్యాయవాదులు, పోలీసులు, సంబంధిత అధికారులు కృషి చేయాలన్నారు.

విద్యార్థులు రాణించాలి

మిరుదొడ్డి(దుబ్బాక): విద్యార్థులు అన్నిరంగాల్లో రాణించాలని పీఆర్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు నాగిరెడ్డి అన్నారు. మండల పరిధిలోని అల్వాల ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు బుధవారం సైన్స్ నమూనాలు, ప్రయోగాలు, రంగవల్లుల పోటీలు నిర్వహించారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో హెచ్ఎం పద్మజ, ఉపాధ్యాయులు వెంకట నారాయణ, శ్రీనివాసులు, ఎల్లేష్, మల్లయ్య, విఠల్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): వసతి గృహాల సమస్యలను పరిష్కరించే దిశగా కాంగ్రెస్ పార్టీ ముందుకు సాగుతుందని ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు అజ్మత్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ఎస్సీ, ఎస్టీ వసతి గృహాలను సందర్శించారు. ఈ సందర్భంగా వసతి గృహాల సమస్యలను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. సమస్యలను నియోజకవర్గ ఇన్‌చార్జి పూజల హరికృష్ణ, ఇన్‌చార్జి మంత్రి సురేఖ దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తామన్నారు.

నీటి ఎద్దడి నివారణకు చర్యలు చేపట్టాలి

బెజ్జంకి(సిద్దిపేట): వేసవిలో నీటి ఎద్దడి నివారణకు చర్యలు తీసుకోవాలని ఎంపీపీ లింగాల నిర్మల అన్నారు. బెజ్జంకి మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన మండల పరిషత్ సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రభుత్వ కార్యక్రమాల్లో అధికారులు ప్రొటోకాల్ పాటించడంలేదని జెడ్పీటీసీ కవిత ఆవేదన వ్యక్తం చేశారు. ఇథనాల్ ఫ్యాక్టరీ గుగ్గిళ్ల శివారులో ఏర్పాటు చేయొద్దని, గతంలో మంజూరైన అభివృద్ధి పనుల నిధులు రద్దు చేయొద్దని తీర్మానాలు చేశారు. అంగన్‌వాడీ పాఠశాలలో చేపట్టే కార్యక్రమాల వివరాలు తెలియడంలేదని, కొందరు సీపీలు అవినీతికి పాల్పడుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, అవినీతికి పాల్పడితే చర్యలు తీసుకుంటామని ఎంపీపీ హెచ్చరించారు.

మరోమారు వినతి పత్రం

కొండపాక(గజ్వేల్): మండలంలోని ఖమ్మంపల్లి శివారు ప్రభుత్వ భూమిని కబ్జాకాకుండా చర్యలు చేపట్టాలని కోరుతూ గ్రామస్తులు మరోమారు గజ్వేల్ ఆర్డీఓ కార్యాలయంలో బుధవారం వినతి పత్రం అందజేశారు. సర్వేనంబరు 1060, 1061లలో పదెకరాల ప్రభుత్వ భూమిని గ్రామ అభివృద్ధి పనులకు ఉపయోగించుకునేలా గ్రామ పంచాయతీ ఏకగ్రీవ తీర్మానం చేసిన ప్రతిని గత బీఆర్ఎస్ ప్రభుత్వానికి పంపింది. వెంటనే ఆమోదం తెలుపుతూ ఆ భూమికి హద్దులు చూపాలని రెవెన్యూ అధికారులకు ఆదేశాలిచ్చింది. అధికారుల నిర్లక్ష్యం కారణంగా కొంత భూమిని సిద్దిపేట, పరిసర గ్రామాలకు చెందినవారు తమకూ ప్రభుత్వం పట్టా సర్టిఫికెట్ ఇచ్చిందంటూ ఆక్రమించుకునే ప్రయత్నంలో గొడవలు జరుగుతున్న విషయం పాఠకులకు తెలిసిందే. పది రోజుల్లో సమస్యను పరిష్కరిస్తామన్న ఆర్డీఓ బన్సీలాల్ పట్టించుకోకపోవడంతో మరోమారు హౌసింగ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ మడుపు భూంరెడ్డి, ఎంపీటీసీ యాదగిరి, రఘురాంలు, శంకరయ్య ఆర్డీఓ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. నాటి ప్రభుత్వం మంజూరు చేసిన పదెకరాలు చూపి వాటికి హద్దులు ఏర్పాటుచేయాలని గ్రామస్తులు కోరారు.

స్టేడియం ఉన్నా.. నిర్వహణ సున్నా

నియోజకవర్గ కేంద్రమైన గజ్వేల్‌లో క్రీడాకారులకు సరైన మౌలిక వసతులు లేకపోవడంతో ప్రతిభ చాటలేకపోతున్నారు. ఎన్నో ఏళ్లుగా వృథాగా ఉన్న మినీ స్టేడియం అరకొర వసతులతో అందుబాటులోకి వచ్చినా కొన్ని క్రీడలు మాత్రమే ఇక్కడ జరిగాయి. తరచూ క్రీడాపోటీలు జరగాలి. పట్టణంలోని ఇంటిగ్రేటెడ్ ఆఫీస్ క్లాంపెక్స్ సమీప మైదానంలో ఇటీవల జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీలు నిర్వహించారు.



గజ్వేల్‌లోని మినీ స్టేడియంలో కబడ్డీ ఆడుతున్న క్రీడాకారులు

- తూప్రాన్ రోడ్డులో మినీ స్టేడియం నిర్మాణం
- నిర్వహణలో అధికారులు విఫలం
- శిథిలావస్థకు చేరుకున్న వైనం
- చర్యలు చేపట్టాలంటున్న క్రీడాకారులు

గజ్వేల్‌రూరల్: గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించాలని 1993లో అప్పటి ప్రభుత్వం గజ్వేల్‌లోని తూప్రాన్ రోడ్డులోని ఫైర్‌స్టేషన్ మార్గంలో మినీ స్టేడియం నిర్మించారు. కానీ రెండు దశాబ్దాలుగా దీన్ని సరైనవిధంగా వినియోగంలోకి తేవడంలో సంబంధిత అధికారులు పూర్తిగా విఫలమయ్యారు. ఫలితంగా స్టేడియం శిథిలావస్థకు చేరుకుంది. దీంతో యువజన సంఘాల రాష్ట్ర కార్యదర్శి, జాతీయ యువజన అవార్డు గ్రహీత దేశబోయిన నర్సింలు నేతృత్వంలో ఆరు నెలలపాటు వివిధ రూపాల్లో ఉద్యమాన్ని కొనసాగించారు. అయినా స్పందన రాకపోవడంతో యువజన సంఘాల సభ్యులు శ్రమించి స్టేడియాన్ని తీర్చిదిద్దారు. 2009 జనవరి 19న జిల్లా స్థాయి యువజన క్రీడోత్సవాలు నిర్వహించి స్టేడియంను వినియోగంలోకి తెచ్చారు. యువజన సంఘాల చొరవతో ఆటల సందడి కనిపిస్తే ఆ తర్వాత మళ్లీ మరుగునపడింది. కాగా స్టేడియం అభివృద్ధికి గతంలో క్రీడాభివృద్ధి పథకం కింద రూ.2.10 కోట్లు మంజూరయ్యాయి. ఈ నిధులతో ఇండోర్ స్టేడియం, పెవీలియన్, షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణాలు చేపట్టారు.

పట్టణానికి దూరంగా ఉండటంతో..

పట్టణానికి స్టేడియం కిలోమీటర్ దూరంలో ఉంది. దీంతో అక్కడ పోటీలు నిర్వహించడానికి నిర్వాహకులు ఆసక్తి చూపడం లేదు. పట్టణంలోని ఇంటిగ్రేటెడ్ ఆఫీస్ కాంప్లెక్స్ సమీప మైదానంలో క్రీడా పోటీలు నిర్వహిస్తున్నారు. పట్టణంలోని ఎర్రకుంటమీదుగా రోడ్డు నిర్మిస్తే దూరం తగ్గే అవకాశముంది. మినీ స్టేడియంలోని పెవీలియన్ భవనంలో ఆర్టీఏ కార్యాలయం ఏర్పాటు కావడంతో క్రీడల నిర్వహణకు విముఖత చూపుతున్నారు.

హామీగా మిగిలిన క్రీడావిలేజ్

గజ్వేల్‌లో మినీ స్టేడియం ఉన్నప్పటికీ కొన్ని క్రీడలకు మాత్రమే పరిమితమైంది. ఫుట్‌బాల్, క్రికెట్ లాంటి ఆటలు ఆడేందుకు అనువైన స్థలం లేకపోవడంతో క్రీడాకారులు, యువజన సంఘాల వినతితో గత బీఆర్ఎస్ ప్రభుత్వం క్రీడా విలేజ్‌ను ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ప్రకటించింది. మినీస్టేడియం చుట్టూ ఉన్న మొత్తం 29 ఎకరాల స్థలాన్ని సేకరించిన అధికారులు హద్దులు ఏర్పాటు చేశారు. 2021 ఆగస్టులో ఫుట్‌బాల్ అకాడమీ కోసం రూ.2 కోట్లను కేటాయిస్తున్నట్లు జీవో విడుదల చేయగా అది ఇంతవరకు కార్యరూపం దాల్చలేదు. క్రీడా విలేజ్ విషయమై జిల్లా క్రీడల, యువజన సంక్షేమాధికారిని వివరణ కోరగా ఫుట్‌బాల్ అకాడమీ ఏర్పాటుకు గత ప్రభుత్వం జీవో జారీ చేసిందన్నారు. కాగా ఫుట్‌బాల్ అకాడమీ ఏర్పాటు కాలేదని, ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు.

వినియోగంలోకి తేవాలి



గతంలో మినీ స్టేడియం ఆవరణలో రాష్ట్ర, జాతీయ స్థాయి ఫుట్‌బాల్ పోటీలకు శిక్షణ ఇవ్వడంతో పాటు ఉమ్మడి జిల్లా ఫుట్‌బాల్ పోటీలను నిర్వహించడం జరిగింది. ఈ ప్రాంతంలో ప్రతిభ కలిగిన క్రీడాకారులు ఎంతో మంది ఉన్నారు. ఫుట్‌బాల్ అకాడమీని ఏర్పాటు చేస్తున్నట్లు గత బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రకటించినప్పటికీ ఇంకా కార్యరూపం దాల్చలేదు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించి మినీ స్టేడియంలో మరిన్ని మౌలిక సౌకర్యాలు కల్పించడంతో పాటు క్రీడా విలేజ్ ఏర్పాటుకు చర్యలు చేపట్టాలి. మినీ స్టేడియం వెళ్లేందుకు ఎర్రకుంట మీదుగా రోడ్డు నిర్మిస్తే క్రీడాకారులకు ఉపయోగకరంగా ఉంటుంది.

– నర్సింహులు, ఎన్ఐఎస్, ఫుట్‌బాల్ కోచ్, గజ్వేల్

ఎల్ఆర్ఎస్ ఉచితంగా చేయాలి



ధర్నాలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే సతీష్‌కుమార్, బీఆర్ఎస్ నాయకులు

మాజీ ఎమ్మెల్యే సతీష్‌కుమార్

హుస్నాబాద్: ప్లాట్లు, లేఔట్ల క్రమబద్ధీకరణకు ప్రభుత్వం అమలు చేస్తున్న భూ క్రమబద్ధీకరణ (ఎల్ఆర్ఎస్) చార్జీలు వసూలు చేయకుండా ఉచితంగా చేయాలని మాజీ ఎమ్మెల్యే సతీష్‌కుమార్ డిమాండ్ చేశారు. ఎల్ఆర్ఎస్‌లో చార్జీలు వసూలు చేయడాన్ని నిరసిస్తూ బుధవారం పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఎల్ఆర్ఎస్ పథకాన్ని తీసుకువచ్చామన్నారు. ఎల్ఆర్ఎస్ పథకం ద్వారా ప్రజల రక్తం తాగుతున్నారని నాడు కాంగ్రెస్ నేతలు ఆరోపించారని గుర్తు చేశారు. ఇప్పుడు మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ఎల్ఆర్ఎస్ కాకుండా హైకోర్టును ఆశ్రయించారన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే ఎల్ఆర్ఎస్‌ను ఉచితంగా చేస్తామని హామీ ఇచ్చారని, ఇచ్చిన మాట ప్రకారం ఎల్ఆర్ఎస్‌ను ఉచితంగా చేయాలని డిమాండ్‌చేశారు. కార్యక్రమంలో హన్మకొండ జెడ్పీ చైర్మన్ సుధీర్ కుమార్, మున్సిపల్ చైర్ పర్సన్ ఆకుల రజిత, వైస్ చైర్ పర్సన్ అయిలేని అనిత, ఎంపీపీ లకావత్ మానస, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు వెంకట్రామిరెడ్డి, పట్టణ అధ్యక్షుడు అన్వర్ పాషా, నాయకులు పాల్గొన్నారు.

దుబ్బాకటౌన్: కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాకముందు ఓ మాట, వచ్చాక ఓ తీరుగా నడుచుకోవడం సిగ్గుచేటని మున్సిపల్ చైర్‌పర్సన్ గన్నె వనిత, బీఆర్ఎస్ దుబ్బాక మున్సిపల్ అధ్యక్షుడు పల్లె వంశీకృష్ణాగౌడ్, మండల అధ్యక్షుడు శ్రీనివాస్ అన్నారు. బుధవారం ఎల్ఆర్ఎస్‌కు ప్రభుత్వం చార్జీలు వసూలు నిర్ణయాన్ని వ్యతిరేకిస్తు పార్టీ ఆధ్వర్యంలో దుబ్బాకలో ఆందోళన చేపట్టారు. పార్టీ మున్సిపల్ అధ్యక్షుడు వంశీకృష్ణ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం ముందు బైఠాయించి నినాదాలు చేశారు. అనంతరం కమిషనర్ రమేష్‌కుమార్‌కు వినతి పత్రం అందజేశారు.

మోదీ నాయకత్వంలో భారత్ అగ్రస్థానం

దుబ్బాకటౌన్: ప్రపంచంలో భారత దేశాన్ని అగ్రస్థానంలో నిలిపిన ఘనత ప్రధాన మంత్రి నరేంద్ర మోదీదని మాజీ ఎమ్మెల్యే, బీజేపీ రాష్ట్ర కార్యదర్శి రఘునందన్‌రావు అన్నారు. బుధవారం పట్టణంలోని వైశ్యభవన్‌లో ఏర్పాటుచేసిన ఎల్ఈడీ స్క్రీన్‌పై ప్రధాన మంత్రి నరేంద్రమోదీ నారీశక్తి వందన్ అభియాన్ కార్యక్రమాన్ని మహిళా స్వయం సహాయక సంఘాలతో కలిసి వీక్షించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నారీ శక్తి వందన్‌అంటూ మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పించే చారిత్రాత్మక బిల్లుకు శ్రీకారం చుట్టడం అభినందనీయమన్నారు. మహిళలు మరోసారి మోదీ నాయకత్వాన్ని దేశానికి అందించాలన్నారు.

హుస్నాబాద్: మహిళా సాధికరతకు శక్తి వందన్ అభియాన్ కార్యక్రమాన్ని ప్రారంభించారని బీజేపీ హుస్నాబాద్ అసెంబ్లీ కన్వీనర్ గుర్రాల లక్ష్మారెడ్డి అన్నారు. బుధవారం ప్రధాని మోదీ నిర్వహించిన శక్తి వందన్ అభియాన్ కార్యక్రమాన్ని మహిళలతో కలిసి వీక్షించారు. కార్యక్రమంలో బీజేపీ అసెంబ్లీ కోకన్వీనర్ వేణుగోపాల్ రావు పాల్గొన్నారు.

వంటిమామిడి మార్కెట్ చైర్మన్ పదవి కేటాయించాలి

ములుగు(గజ్వేల్): మండలంలోని వంటిమామిడి మార్కెట్ కమిటీ చైర్మన్ పదవిని ములుగు మండల అభ్యర్థికే కేటాయించాలని కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేశారు. వంటిమామిడిలో బుధవారం పార్టీ మండల అధ్యక్షుడు శ్రీనివాస్‌గుప్తా అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఈ మేరకు తీర్మానం చేశారు. వంటిమామిడి మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి ఎస్సీ మహిళకు రిజర్వు కావడంతో కాంగ్రెస్‌కు క్రియాశీలకంగా పనిచేసిన కార్యకర్తల కుటుంబాలకే ఆ పదవిని కేటాయించాలన్నారు. మండలంలోని క్షీరసాగర్, అచ్చాయిపల్లి, కొట్యాల, మామిడ్యాల, అడవిమజీద్, నర్సాపూర్ గ్రామాలకు చెందిన కాంగ్రెస్ నాయకుల కుటుంబాల నుంచి అభ్యర్థుల పేర్లను ప్రతిపాదిస్తూ సమావేశంలో తీర్మానించారు. సమావేశంలో కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షుడు భూపాల్‌రెడ్డి, మాజీ ఎంపీపీ వెంకట్రాంరెడ్డి, కిసాన్‌సెల్ అధ్యక్షుడు రాజు, బీసీ సెల్ అధ్యక్షుడు మల్లేషయాదవ్, మైనార్టీ సెల్ అధ్యక్షుడు నయీమొద్దీన్, ఎస్సీసెల్ అధ్యక్షుడు బాబు, బద్రయ్య పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి



గజ్వేల్‌రూరల్: జడ్జి ప్రియాంకను సన్మానిస్తున్న అధ్యాపకులు



హుస్నాబాద్: మహిళా ప్రయాణికులను సన్మానిస్తున్న డిపో మేనేజర్ వెంకటేశ్వర్లు

గజ్వేల్‌రూరల్: మహిళలు చైతన్యవంతులై అన్ని రంగాల్లో రాణించాలని గజ్వేల్ అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి ప్రియాంక అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని పట్టణంలోని బాలికల ఎడ్యుకేషన్ హబ్‌లోగల ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో మహిళా సాధికారత విభాగం ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడారు. విద్యార్థినులు, మహిళలు ప్రస్తుత పోటీ ప్రపంచంలో తాము ఎంచుకున్న లక్ష్యం దిశగా ముందుకు సాగాలన్నారు. అపరిచితులపట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. మహిళా సాధికారిత విభాగం కన్వీనర్ డాక్టర్ అనిత, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఉమారాణి, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ సౌజన్య తదితరులు మహిళల హక్కులపై అవగాహన కల్పించారు. అనంతరం జడ్జిని సన్మానించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఉమాశశి తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ప్రతిభ చూపిన...

గజ్వేల్‌రూరల్: మున్సిపాలిటీ పరిధిలోని ప్రజ్ఞాపూర్‌లోగల జీపీపీ(గజ్వేల్–ప్రజ్ఞాపూర్) ఆర్టీసీ డిపోలో బుధవారం మహిళా దినోత్సవం జరుపుకున్నారు. కార్యక్రమానికి గజ్వేల్ అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి ప్రియాంక, గజ్వేల్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పీవీ ఉమాశశి హాజరయ్యారు. జీపీపీ డిపో మేనేజర్ సురేఖ ఆధ్వర్యంలో విధుల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన మహిళా ఉద్యోగులు, మహిళా కండక్టర్లు రజిత, రాణి, సుకన్య, స్వాతి తదితరులను సన్మానించారు.

హుస్నాబాద్: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని హుస్నాబాద్ ఆర్టీసీ డిపోలో బుధవారం మహిళా ఉద్యోగులకు ఆటల పోటీలు నిర్వహించారు. 2023–24 సంవత్సరానికిగాను బెస్ట్ ఈపీకె తెచ్చిన మహిళా కండక్టర్లను, రోజూ ప్రయాణించే మహిళలను సన్మానించారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ వెంకటేశ్వర్లు, సూపరింటెండెంట్ శ్రీధర్, ట్రాఫిక్ సూపర్‌వైజర్ నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎన్ని సమస్యలు ఎదురైనా..

సిద్దిపేటకమాన్: విధి నిర్వహణలో ఎన్ని సమస్యలు ఎదురైనా రాణించాలని సీఐ దుర్గ అన్నారు. మహిళా దినోత్సవం పురస్కరించుకుని సిద్దిపేట ఆర్టీసీ డిపోలో మహిళా సిబ్బందికి ఆటల పోటీలు నిర్వహించారు. పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ సుఖేందర్‌రెడ్డి, అసిస్టెంట్ మేనేజర్ మహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

తడి చెత్తతో ఎరువు తయారు

మున్సిపల్ చైర్ పర్సన్ ఆకుల రజిత

హుస్నాబాద్: స్వచ్ఛ సర్వేక్షన్ 2024లో భాగంగా బుధవారం పట్టణంలోని 3, 9వ వార్డుల్లో తడి చెత్త, పొడి చెత్త బుట్టల పంపిణీ, బేసిల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో తడి, పొడి చెత్తపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్ పర్సన్ రజిత మాట్లాడుతూ తడి చెత్త, పొడి చెత్త, హానికరమైన చెత్తను వేరుచేసి మున్సిపల్ కార్మికులకు అందజేయాలన్నారు. పొడి చెత్తను రీసైక్లింగ్‌కు పంపిస్తామని, తడి చెత్తతో ఎరువు తయారు చేసే విధానాన్ని వివరించారు. తయారు చేసిన ఎరువును మొక్కలకు వాడుకోవాలని సూచించారు. ప్లాస్టిక్ సంచులకు బదులుగా వస్త్ర సంచులను వాడుతూ పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలన్నారు. హుస్నాబాద్ పట్టణాన్ని చెత్త



తడి చెత్త, పొడి చెత్త పై అవగాహన కల్పిస్తున్న అధికారులు

రహిత పట్టణంగా మార్చేందుకు ప్రజలు భాగస్వాములు కావాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ అయిలేని అనిత, శానిటరీ ఇన్‌స్పెక్టర్ బాల ఎల్లం, కౌన్సిలర్లు కోమటి స్వర్ణలత, బొజ్జ హరీష్, గోవిందు రవి, దొడ్డి శ్రీనివాస్, బేసిల్ ఫౌండేషన్ ఫౌండర్ ఉదయ్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

యువత చేయూత

గజ్వేల్‌రూరల్: అనారోగ్యంతో మృతి చెందిన మృతుడి కుటుంబానికి ప్రజ్ఞాపూర్ యువత చేయూత అందించింది. గజ్వేల్ మున్సిపాలిటీ పరిధిలోని ప్రజ్ఞాపూర్‌కు చెందిన గుజ్జ అశోక్ బుధవారం అనారోగ్యంతో మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న ప్రజ్ఞాపూర్ యువత బాధిత కుటుంబాన్ని పరామర్శించి రూ. 20 వేల ఆర్థిక సాయం అందజేశారు.

అప్రమత్తంగా ఉండాలి

గజ్వేల్‌రూరల్: విద్యార్థినులు అపరిచితుల పట్ల అప్రమత్తంగా ఉండాలని గజ్వేల్ సీఐ సైదా అన్నారు. పట్టణంలోని బాలికల ఎడ్యుకేషన్ హబ్‌లోగల మోడల్ స్కూల్‌లో మహిళా దినోత్సవం సందర్భంగా రక్షణ చట్టాలపై బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు శ్రద్ధగా చదువుకోవాలన్నారు. అపరిచితుల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో గజ్వేల్ షీటీమ్ ఏఎస్ఐ శ్రీరాములు, ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

ప్రతిభ చాటితే అపార అవకాశాలు

గజ్వేల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాస్‌రెడ్డి

గజ్వేల్‌రూరల్: ప్రతిభ చాటినప్పుడే అపార అవకాశాలు లభిస్తాయని గజ్వేల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని బాలుర ఎడ్యుకేషన్ హబ్‌లోగల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం టీఎస్‌కేసీ ఆధ్వర్యంలో పిరమిల్ ఫైనాన్స్ కంపెనీ సమన్వయంతో జాబ్ మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీఎస్‌కేసీ ద్వారా ఉద్యోగ నైపుణ్యాలపై శిక్షణ ఇస్తూ ఉద్యోగావకాశాలను కల్పించడం జరుగుతుందన్నారు.

రైతాంగ బలోపేతానికి రైతు నేస్తం

గజ్వేల్: గజ్వేల్‌లోని రైతు వేదికలో వీడియో కాన్ఫరెన్స్‌ను బుధవారం ప్రారంభించారు. మొదటి కాన్ఫరెన్స్‌లో సీఎం రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క, వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, వ్యవసాయశాఖ కార్యదర్శి రఘునందన్ రావు, కమిషనర్ గోపీ వానాకాలం సీజన్ నుంచి ప్రారంభమయ్యే పంటల బీమా పథకం, వ్యవసాయ రంగంలో వస్తున్న మార్పులు తదితర అంశాలపై సలహాలు అందించారు.

మర్కూక్(గజ్వేల్): హైదరాబాద్ వ్యవసాయ శాఖ కేంద్ర కార్యాలయంలో సీఎం రేవంత్‌రెడ్డి రైతు నేస్తం కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని బుధవారం మర్కూక్ రైతు వేదికలో ఏర్పాటు చేసిన టీవీలో ములుగు డివిజన్ పరిధిలోని రైతులు, అధికారులు వీక్షించారు.

సిద్దిపేటఅర్బన్: సిద్దిపేట అర్బన్ మండలం మిట్టపల్లి రైతువేదికలో బుధవారం సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభించిన రైతు నేస్తం తొలి వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా వ్యవసాయ శాఖ అధికారులు పాల్గొన్నారు. వీడియో కాన్ఫరెన్స్ సౌకర్యాన్ని రైతులు, వ్యవసాయ అనుబంధ రంగాల వారు ఉపయోగించుకొని నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని డీఏవో శివప్రసాద్ సూచించారు.

చేర్యాల(సిద్దిపేట): ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని నేరుగా రైతులకు తెలియజేయాలని బుధవారం సీఎం రేవంత్‌రెడ్డి రైతు నేస్తం కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో చేర్యాల మండల వ్యవసాయ అధికారి ఆఫ్రోజ్, మద్దూరు ఏఓ రామకృష్ణ, కొమురవెల్లి మండల వ్యవసాయ అధికారి నరేష్, ఆకునూరు ఎంపీటీసీ శ్రీధర్, పాల్గొన్నారు.

మళ్లీ తహసీల్దార్ బదిలీ

కొండపాక(గజ్వేల్): కొండపాక తహసీల్దార్‌గా దిలీప్ నాయక్‌ను నియమిస్తూ బుధవారం రాత్రి కలెక్టర్ కార్యాలయం నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఈయన సిద్దిపేట రూరల్ తహసీల్దార్‌గా పనిచేస్తున్నారు. కొండపాక తహసీల్దార్‌గా ఫిబ్రవరి 27వ తేదీన బాధ్యతలు చేపట్టిన బాలరాజు వర్గల్ తహసీల్దార్‌గా బదిలీ అయ్యారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో కొండపాక తహసీల్దార్ శ్రీనివాస్‌ను గజ్వేల్ తహసీల్దార్‌గా, గజ్వేల్ తహసీల్దార్ బాలరాజును కొండపాకకు బదిలీ చేస్తూ ఫిబ్రవరి 15న కలెక్టర్ కార్యాలయం నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. శ్రీనివాస్ బదిలీపై వెళ్లి రోజున గజ్వేల్ తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టారు. బాలరాజు కొండపాక తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టకపోవడంతో రెవెన్యూ సేవలు బంద్ శీర్షికన వరుస కథనాలు సాక్షిలో ప్రచురితమవడంతో కలెక్టర్ స్పందించారు. దీంతో ఫిబ్రవరి 24న కొండపాక తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టారు. బాధ్యతలు చేపట్టిన రెండు రోజులకే మళ్లీ చేర్యాల తహసీల్దార్‌గా బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. మళ్లీ కొండపాక నుంచి వర్గల్‌కు బాలరాజును బదిలీ చేయడంతో సిద్దిపేట రూరల్ తహసీల్దార్ దిలీప్ నాయక్‌ను కొండపాక తహసీల్దార్‌గా బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి.

సంక్షిప్త వార్తలు

◆ హుస్నాబాద్ సీఐగా శ్రీనివాస్

హుస్నాబాద్: హుస్నాబాద్ నూతన సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా శ్రీనివాస్ బుధవారం పదవీ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణకు శక్తి వంచన లేకుండా కృషి చేస్తామన్నారు. తనను నేరుగా కలిసి సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు. కాగా సీఐ కిరణ్ సిద్దిపేట సీసీఎస్‌బీకి బదిలీపై వెళ్లారు.

◆ చలివేంద్రం ప్రారంభం

మద్దూరు(హుస్నాబాద్): మండలంలోని సలాఖపూర్‌లో అల్‌ఖైర్ సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఎంపీటీసీ రాజేశ్వర్‌రెడ్డి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవిలో ప్రయాణికుల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ మాజీ వైస్ చైర్మన్ జీవన్‌రెడ్డి, మాజీ సర్పంచ్ భాస్కర్‌రెడ్డి, జబ్బార్ హఫీజ్, కరీం నజీవ్, అక్రమ్ తదితరులు పాల్గొన్నారు.

◆ మహిళలు ఆర్థికంగా ఎదగాలి

మద్దూరు(హుస్నాబాద్): మహిళలు ఆర్థికంగా ఎదగాలని ఏపీఎం బాబు అన్నారు. బుధవారం సమైక్య కార్యాలయంలో వీఓఏలకు లక్‌పతి దీదీపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ మహిళలు ఆర్థికంగా మెరుగు పరిచేలా సమావేశాలు నిర్వహించామన్నారు. కార్యక్రమంలో సీసీలు పాల్గొన్నారు.

◆ ఆర్టీసీ డీఎంకు వినతి

చిన్నకోడూరు(సిద్దిపేట): చిన్నకోడూరు మీదుగా ఆర్టీసీ బస్సు నడపాలని కోరుతూ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మహేందర్ యాదవ్ బుధవారం సిద్దిపేట ఆర్టీసీ డిపో మేనేజర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో సిద్దిపేట నుంచి చిన్నకోడూరు మీదుగా ఇల్లంతకుంటకు ఆర్టీసీ బస్సు సౌకర్యం ఉండేదన్నారు. గత మూడేళ్లుగా బస్సు రద్దు చేయడంతో ప్రజలకు రవాణా సౌకర్యం లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. మళ్లీ బస్సును పునః ప్రారంభించాలని కోరారు.

◆ అర్హులకు పథకాలు అందాలి

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అందే విధంగా అధికారులు ప్రత్యేక చొరవ చూపాలని ధర్మ సమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షుడు రవిబాబు అన్నారు. బుధవారం జిల్లా ఎస్సీ కార్పొరేషన్ ఈడీ శ్రీరామ్‌రెడ్డిని కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దళితబంధు అందించడంలో గత బీఆర్ఎస్ సర్కార్ విఫలమైందన్నారు. ఎస్సీ కార్పొరేషన్ సబ్సిడీ రుణాలు అర్హులకు అందడం లేదని ఆరోపించారు. కార్యక్రమంలో డీఎస్పీ జిల్లా నాయకులు సురేష్, యాదగిరి, అనిల్, దీపక్, యూసుఫ్, తదితరులు పాల్గొన్నారు.

◆ నూతన పాలక వర్గం ఏకగ్రీవం

కొండపాక(గజ్వేల్): మండలంలోని దుద్దెడ స్వయం భూ శంభు లింగేశ్వర సేవా కమిటీ ట్రస్టు చైర్మన్‌గా మాజీ పీఏసీఎస్ చైర్మన్ మంచాల శ్రీనివాస్ ఎన్నికయ్యారు. బుధవారం దేవాలయ ప్రాంగణంలో నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా అనంతుల నరేందర్, పబ్బోజు శ్రీనివాస్‌చారి, ప్రధాన కార్యదర్శిగా పెద్దంకుల శ్రీనివాస్, కోశాధికారి వడ్లకొండ శ్రీనివాస్, సహాయ కార్యదర్శులు నర్ర దేశాయిరెడ్డి, నూనె కుమార్, పెద్ది కుమారస్వామి, సహాయ కోశాధికారి మంచాల చిన్న శ్రీనివాస్ సలహాదారులు మంచాల కృష్ణమూర్తి, గోనె శ్రీనివాస్, బూర్గుల వెంకటరమణ ఎన్నికయ్యారు.

◆ రూరల్ తహసీల్దార్‌గా హరికిరణ్ కుమార్

సిద్దిపేటరూరల్: రూరల్ మండల తహసీల్దార్‌గా హరికిరణ్ కుమార్‌ను నియమిస్తూ కలెక్టర్ మను చౌదరి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈయన వర్గల్ తహసీల్దార్‌గా పనిచేస్తున్నారు. ఇక్కడ పనిచేసిన దిలీప్‌నాయక్‌ను కొండపాకకు బదిలీ చేశారు.

◆ నష్ట పరిహారం చెల్లించండి

హుస్నాబాద్: జాతీయ రహదారి రోడ్డు విస్తరణలో కల్లు పారే 14 తాటిచెట్లను తొలగించే వాటికి నష్ట పరిహారం, గీత కార్మికుల జీవనోపాధికి ప్రభుత్వం నుంచి ఆర్థిక సహాయం అందించాలని కోరుతూ బుధవారం ఆర్డీఓ, తహసీల్దార్, ఎక్సైజ్ సీఐకి వినతి పత్రం ఇచ్చినట్లు గీత పారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షుడు వరప్రసాద్, డైరెక్టర్ నర్సాగౌడ్ తెలిపారు. రోడ్డు విస్తరణలో తాటి, ఈత చెట్లకు నష్టం జరుగుతోందన్నారు.

◆ టెన్ జీపీఏ సాధిస్తే నగదు బహుమతి

వర్గల్(గజ్వేల్): పదో తరగతి పరీక్షల్లో పదికి పది గ్రేడ్‌పాయింట్లు సాధించిన ప్రతీ విద్యార్థికి నగదు ప్రోత్సాహక బహుమతి అందజేస్తామని గజ్వేల్ రోటరీ క్లబ్ చైర్మన్ బాబుగౌడ్ అన్నారు. బుధవారం వర్గల్ జెడ్పీ హైస్కూల్‌లో టెన్త్ విద్యార్థులకు పరీక్ష ప్యాడ్స్, పెన్నులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి కాకుండా ఇష్టపడి చదివి ఫలితాలు సాధించాలన్నారు.